వర్సిటీ భూములతో చెలగాటం వద్దు

- చరిత్ర హీనులుగా మిగిలిపోవద్దు
- ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి నాగరాజు
- విద్యార్థి నాయకులను టార్గెట్ చేస్తే ఊరుకోం: డీవైఎఫ్ఐ ప్రెసిడెంట్
- 14వ రోజు కొనసాగిన అగ్రికల్చర్ వర్సిటీ విద్యార్థుల నిరసన

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 22: వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల భూములపై కన్నేసిన సీఎం రేవంత్‌రెడ్డి దిగివచ్చే వరకు ఉద్యమాలు కొనసాగించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగ రాజు పిలుపునిచ్చారు. వర్సిటీ విలువ తెలిసిన ప్రతి ఒక్కరు విద్యార్థులకు మద్దతు ఇవ్వా లని, లేదంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించడాన్ని నిరసిస్తూ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివ ర్సిటీ విద్యార్థులు చేపడుతున్న నిరసన కార్య క్రమానికి సోమవారం ఆయన మద్దతు ప్రక టించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 55ను తక్షణం రద్దు చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరా టానికి తాము అండగా ఉంటామని పేర్కొ న్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేశ్ మాట్లాడుతూ విద్యార్థి నాయకులను ఉన్నతాధికారులు టార్గెట్ చేయడం మానుకో వాలని హెచ్చరించారు. వారిపై లేనిపోని ఆరో పణలు చేస్తూ ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరు కోబోమని పేర్కొన్నారు. అంతకుముందు విద్యార్థులు మాట్లాడుతూ దేశానికి ప్రత్య క్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న యూని వర్సిటీని చీల్చడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి ఈ విషయంలో మరో మారు ఆలోచించాలని డీవైఎ ఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బీ శంకర్ కోరారు. విద్యార్థుల నిరసన సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. రాజేంద్రన గర్‌తోపాటు పాలెం, వరంగల్, సిరిసిల్ల, అశ్వారావుపేట, జగిత్యాల, ఆదిలా బాద్, సంగారెడ్డిలోని వ్యవసాయ కళాశాలల విద్యార్థులు కూడా నిరసన ప్రదర్శనలు చేప ట్టారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్ రెడ్డి, శంకర్‌నాయక్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర శకటానికి చోటు

'ప్రజాస్వామ్యం' థీమ్‌తో ఉద్యమస్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రదర్శన

ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనకు చోటు దక్కించుకున్న తెలంగాణ రాష్ట్ర శకటం

హైదరాబాద్, జనవరి 22(నమస్తే తెలం గాణ): ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర శకటం ప్రదర్శనకు చోటు దక్కింది. ఈ ఏడాదే కాదు, వచ్చే రెండేండ్ల పాటు మన శకటం ప్రదర్శనకు కేంద్రం నుంచి అనుమతి లభించింది. 2015, 2020 తరు వాత ఈ ఏడాదే మన రాష్ట్ర శకటానికి ఈ అవ కాశం దక్కింది. 'ప్రజాస్వామ్యం' థీమ్‌తో శక టాన్ని రూపొందించినట్టు ప్రభుత్వం వెల్లడిం చింది. కుమ్రంభీం, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ తదితర ఉద్యమకారుల వీరోచిత పోరాటాలను ఇతివృత్తంగా చూపించను న్నారు. ఆనాటి స్వీయపాలన, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తి మరోసారి ప్రపంచా నికి తెలిసేలా రిపబ్లిక్ డే వేడుకల్లో మన రాష్ట్ర శకటాన్ని రూపొందించినట్టు అధికారులు తెలి పారు. ఆయా స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తి అట్టడుగు వర్గాల్లో ప్రజాస్వామ్య విలు వలను కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధ తకు ఈ శకటం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుం దని వారు పేర్కొన్నారు.

ఐదుగురు మహిళా సర్పంచులకు ఆహ్వానం

న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవా లకు తెలంగాణకు చెందిన ఐదుగురు మహిళా సర్పంచులను ఆహ్వానించారు. భర్తలు సహా వేడుకలకు రావాల్సిందిగా పేర్కొన్నారు. వారిలో పాపిశెట్టి శైలజ (ఖమ్మం), ఎం అనితారాణి (ములుగు), పీ సురేఖ (నాగర్‌కర్నూలు), బక్క రమాదేవి (సంగారెడ్డి), కాంతి లక్ష్మి (వికారాబాద్) ఉన్నారు. వీరు ఈనెల 24న ఢిల్లీకి వెళ్లను న్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గ్రామాలను ఆద ర్శంగా తీర్చిదిద్దడంలో కృషి చేసినందుకు, స్వచ్ఛ గ్రామాలను ప్రోత్సహించాలనే ఉద్దే శంతో ఈ ఐదుగురు సర్పంచులకు ఆహ్వానం పలికినట్టుగా తెలిసింది.

కిం కర్తవ్యం!?

మొదటిపేజీ తరువాయి...

మినిట్స్‌లో పొందుపరచాలని కోరాలని నిర్ణయించినట్టు తెలుస్తు న్నది. సమావేశ ఎజెండాలో ప్రాజె క్టుల ఆపరేషన్ ప్రొటోకాల్ అంశాన్ని పొందుపరిచినా దానిపై చర్చించలే దని తెలంగాణ సర్కారు వాదిస్తు న్నది. ఆపరేషన్ ప్రొటోకాల్ లేకుండా, తెలంగాణ గతంలో లేవనె త్తిన 50:50 నిష్పత్తిలో నీటి విని యోగం, క్యారీఓవర్ స్టోరేజీ తదితర అంశాలపై స్పష్టతనివ్వాలని కోరుతూ, అవన్నీ పూర్తయితే కానీ ప్రాజెక్టులను అప్పగించబోమనే అంశాన్ని కేంద్రానికి స్పష్టంగా తెలి యజేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా లేఖను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను కూడా ఆదేశించగా, వారు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే కేంద్ర జలశక్తిశాఖ ఆదేశాల మేరకు ప్రాజెక్టుల స్వాధీనానికి కేఆర్ఎంబీ సైతం కసరత్తు ప్రారంభించింది. త్వర లోనే ఆపరేషన్ ప్రొటోకాల్‌పై సమా వేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమవు తున్నది.

కరెంట్ బిల్లులు కట్టం!

- సీఎం సార్ మీరిచ్చిన హామీని మేం నిలబెడతాం
- ఈ నెలనుంచే విద్యుత్తు బిల్లుల చెల్లింపులను ఆపేస్తాం
- '200 యూనిట్ల'లోపు వినియోగదారుల స్పష్టం
- డిసెంబర్ నుంచి బిల్లులు కట్టొద్దని ఎలక్షన్ టైంలో చెప్పిన రేవంత్
- జనవరి ముగుస్తున్నా ఉలుకూ పలుకూ లేని కొత్త ప్రభుత్వం
- ప్రభుత్వం స్పందించకపోవడంతో వినియోగదారుల సొంత నిర్ణయం

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలం గాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుం టుందా? లేదా? అనేది తేలకపోవడంతో.. ఆ హామీని తామే అమలు చేసుకొనే ఆలోచ నలో ప్రజలున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్తు బిల్లుల మాఫీపై కాంగ్రెస్ సర్కారు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో విని యోగదారులే సొంత నిర్ణయం తీసుకొంటు న్నారు. ఈ నెల నుంచే కరెంటు బిల్లులను కట్టబోమని తేల్చి చెప్తున్నారు.

ప్రచారంలో అలా..

తీవ్ర పోటాపోటీగా జరిగిన మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అలవిగాని హామీలు ఇచ్చింది. అసలు సాధ్యాసాధ్యా లను పరిశీలించలేదు. 2023 నవంబర్ 10న పాలకుర్తితోపాటు హైదరాబాద్‌లోని అమీర్ పేట్, సీతాఫల్‌మండి చౌరస్తా తదితర ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు.. ఇప్పటి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల నుంచి (డిసెం బర్) నుంచి 200 యూనిట్లలోపు విద్యుత్తు బిల్లులను కట్టవద్దని, ఆ మొత్తాలను కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ కడతారని భరోసా ఇచ్చారు. ఆ హామీలు నిజమేనని నమ్మి తాము ఓట్లేసి కాంగ్రెస్‌ను గెలిపించామని విద్యుత్తు వినియోగదారులు అంటున్నారు.

ప్రభుత్వంలో ఇలా..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అనేక హామీలను గుప్పించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని అమలు చేయడంలో మాత్రం అంత వేగంగా పనిచే యడం లేదు. 200 యూనిట్ల వరకు విద్యు త్తును ఉపయోగించుకొనే గృహ వినియోగ దారుల బిల్లులను పూర్తిగా మాఫీ చేస్తామని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని ఘంటాపథంగా చెప్పిన కాంగ్రెస్ నేతలు.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీళ్లు నములు తున్నారు. డిసెంబర్ నెల నుంచే బిల్లులు కట్ట వద్దని కరాఖండిగా చెప్పిన అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. తాను సీఎం అయిన తర్వాత ఒకటిన్నర నెలలు గడుస్తున్నా విద్యుత్తు బిల్లులపై నోరు మెదపడం లేదు. కేవలం పథకాలను అమలు చేసేందుకే అంటూ రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 30 లక్షల దరఖాస్తులను స్వీకరించి.. వాటన్నింటినీ కంప్యూటరీకరణ పేరుతో తాత్సారం చేస్తు న్నారు. 'డిసెంబర్ నుంచే బిల్లులు కట్ట వద్దు.. మీ బిల్లులను సోనియమ్మ కడుతుం దని చెప్పిన నేత మాత్రం డిసెంబర్ గడిచి.. జనవరికూడా ముగుస్తున్నా.. నోరు మెద పడం లేదని వినియోగదారులు మండిపడు తున్నారు. విద్యుత్తు బిల్లులపై కనీసం స్పందించడం లేదని వాపోతున్నారు.

కాంగ్రెస్‌పై వినియోగదారుల అసంతృప్తి

విద్యుత్తు బిల్లులు తామే కడతామని హామీ ఇచ్చిన రేవంత్.. ప్రభుత్వం కొలువు దీరినా హామీని నిలబెట్టుకోకపోవడంతో.. విద్యుత్తు వినియోగదారుల్లో ఒకింత అసం తృప్తి కనిపిస్తున్నది. 'ఇప్పటికే డిసెంబర్ నెలలో బిల్లు కట్టాం.. ఇప్పుడు జనవరి మాసంలోనూ బిల్లు కట్టక తప్పని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం నుంచిగానీ.. సీఎం రేవంత్‌నుంచిగానీ ఎలాంటి ప్రకటన రావడం లేదు' అంటూ ఆగ్రహం వ్యక్తంచే స్తున్నారు. తామే కరెంట్ బిల్లులు కట్ట కుండా ప్రభుత్వం పరువును కాపాడతామని చురకలంటిస్తున్నారు.

1.05 కోట్ల మంది వినియోగదారులు

ప్రస్తుతం రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు విద్యుత్తును వినియోగిస్తున్న గృహ వినియోగదారులు సుమారు ఒక కోటి 5 లక్షల మంది వరకు ఉన్నారని తెలుస్తున్నది. ఇందులో దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్‌పీడీసీ ఎల్) పరిధిలో సుమారు 67 లక్షల వరకు.. ఉత్తర ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) పరిధిలో మరో 38 లక్షల మంది వరకు వినియోగదారు లున్నట్టు అంచనా. కొన్ని నెలల్లో విని యోగించే విద్యుత్తు అవసరాలను బట్టి ఇది కాస్త అటూ ఇటూగా మారుతుంది. సగటున కోటి 5 లక్షల మంది వినియో గదారులు ప్రతి నెలా సుమారు రూ. 350కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు చెల్లిస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన సంవత్సరానికి సుమారు రూ. 4000 కోట్ల నుంచి రూ. 5000 కోట్ల వరకు చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ మొత్తం విని యోగించుకున్న విద్యుత్తు (ఎనర్జీ) చార్జీలు మాత్రమే. అదనంగా కస్టమర్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలుకూడా ఉంటాయి. వాటినికూడా ప్రభుత్వం చెల్లిస్తుందా? లేక డిస్కంలు భరి స్తాయా? లేక వినియోగదారులు భరిం చాల్సి ఉంటుందా? అనేదికూడా ఇంకా తేలాల్సి ఉంది. వీటన్నింటికీ సమా ధానం దొరకాలంటే.. ఇకనైనా ప్రభుత్వం ముందుకు వచ్చి ఇచ్చిన హామీని అమలు చేస్తుందా? లేక విద్యుత్తు వినియోగదారులే హామీని అమలులోకి తీసుకొస్తారా? అనేది వేచి చూడాల్సిందే..!

అన్నారం బరాజ్‌లో గ్రౌటింగ్ పూర్తి

- సీపేజ్‌లకు ముగిసిన ట్రీట్‌మెంట్
- 15 రోజులపాటు అబ్జర్వేషన్
- సాంకేతిక బృందం పరిశీలన.. నివేదిక ఆధారంగా తుది నిర్ణయం

అన్నారం బరాజ్‌లో కెమికల్ గ్రౌటింగ్‌ను పూర్తి చేస్తున్న ఆఫ్కాన్స్ నిపుణులు

జయశంకర్ భూపాలపల్లి (నమస్తే తెలం గాణ)/కాళేశ్వరం, జనవరి 22: జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం బరాజ్‌లో ఏర్ప డిన చిన్న చిన్న సీపేజ్‌లకు నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ ట్రీట్‌మెంట్ పూర్తి చేసింది. పది రోజులుగా సీపేజ్‌లకు కెమికల్ గ్రౌటింగ్ కొన సాగించిన నిపుణులు సోమవారం ప్రక్రి యను పూర్తి చేశారు. బరాజ్‌లోని 38, 28తో పాటు 35వ ఔట్‌లెట్స్‌లో కనిపించిన సీపేజ్ లకు పాలి యూరిథ్రిన్ కెమికల్‌తో గ్రౌటింగ్ చేశారు. ఆఫ్కాన్స్ నిపుణులు 15 రోజు లపాటు అబ్జర్వేషన్‌లో ఉంచనున్నారు. ఆ తర్వాత ఇన్వెస్టిగేషన్ సంస్థ పార్సన్ పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకుంటుంది. అన్నారం (సరస్వతి)బరాజ్‌లో అక్టోబర్‌లో భారీ వర్షాలతో 38, 28 ఔట్‌లెట్స్ వద్ద చిన్న చిన్న సీపేజ్‌లు ఏర్పడ్డాయి. అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు స్టోన్, మెటల్, ఇసు కతో తాత్కాలిక ట్రీట్‌మెంట్ చేసి లీకేజీని అరి కట్టారు. నవంబర్ 2న సీడబ్ల్యూసీ బృందం అన్నారం బరాజ్‌ను సందర్శించి సీపేజ్‌లను పరిశీలించింది. ఇటీవల రాష్ట్ర మంత్రుల బృందం సైతం బరాజ్‌ను పరిశీలించి సీపేజ్ లతో ప్రమాదమేమీ లేదని తేల్చి గ్రౌటింగ్ చేయించాలని సూచించింది. నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ ఈ నెల 13న ట్రీట్‌మెంట్ ప్రారం భించింది. హిమాచల్‌ప్రదేశ్ నుంచి పాలీ యూరిథ్రిన్ కెమికల్‌ను తెప్పించి 28, 38 ఔట్‌లెట్స్ వద్ద గ్రౌటింగ్ చేశారు. 35వ ఔట్ లెట్ వద్ద చిన్న సీపేజ్‌ను కెమికల్‌తో నిరోధిం చారు. బరాజ్‌లోని నీటిని బయటికి పంపి ఏజెన్సీ సంస్థ పార్సన్‌తో ఇన్వెస్టిగేషన్ పనులు ప్రారంభిస్తారు. బరాజ్‌లో ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా.. లోపాలుంటే చేయా ల్సిన పనుల గురించి ఇన్వెస్టిగేషన్ చేసి తుది నిర్ణయం తీసుకుంటారు. అనంతరం బరా జ్‌ను వినియోగంలోకి తీసుకొస్తారు.

హర్షితను తెలంగాణకు తీసుకొస్తున్న తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది

మానసిక దివ్యాంగురాలికి అండగా

- ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు బాధితురాలిని తరలించిన ఎల్ఎస్ఏ
- ఎర్రగడ్డ వైద్యశాలలో చికిత్స

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలం గాణ): మాట్లాడలేని స్థితిలో ఉన్న ఓ మానసిక దివ్యాంగురాలికి తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీ సెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) అండగా నిలి చింది. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో రెండేండ్ల బిడ్డతో ఉన్న మతిస్థిమితంలేని హర్షిత అలియాస్ హరిత రాజాను గరియా బాద్ జిల్లా సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహ కులు కాపాడారు. ఆమె మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బిలాస్‌పూర్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లో చికిత్స అందిం చారు. అయితే, భాషాపరమైన సమస్య తలె త్తడం, తెలుగు అంతంతమాత్రంగా మాట్లాడు తుండటంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక వైద్యశా లకు తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ న్యాయ సేవల ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి టీఎస్ఎల్ఎస్ఏని అభ్యర్థించారు. వెంటనే స్పందించిన టీఎస్ఎల్ఎస్ఏ.. జూని యర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, మహిళా కాని స్టేబుళ్లు స్వాతి, వెన్నెల దేవిని అక్కడికి పంపిం చింది. వారు హర్షితను తీసుకొచ్చి సోమ వారం ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆమె బిడ్డను అమీర్‌పేటలోని శిశువిహార్‌కు తరలించారు. హర్షిత వివరాలు తెలిస్తే 040-23446723 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు ఇవ్వండి: టీఎన్జీవో

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పెండింగ్ బిల్లు లను మంజూరు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని కోరింది. పెండింగ్‌లో ఉన్న డీఏలను సైతం విడు దల చేయాలని విజ్ఞప్తి చేసింది. సోమ వారం టీఎన్జీవో నేతలు సచివాయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారా వును కలిసి వినతిపత్రాలు సమర్పిం చారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 24 శాతం హెచ్ఆర్ఏను మంజూరు చేయాలని, సమస్యలనూ పరి ష్కరించాలని కోరారు. తమ వినతులపై వారు సానుకూలంగా స్పందించినట్టు సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగ దీశ్వర్ తెలిపారు. టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, మాధవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొయినా నీళ్లపై సర్కారు డైలమా

- ఎట్టకేలకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి
- అందుకు సంబంధించి వివరాల సేకరణ
- ఇరిగేషన్ అధికారులతో సీఎస్ ప్రత్యేక సమీక్ష

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలం గాణ): తాగునీటి కోసం మహారాష్ట్ర, కర్ణాట కను సంప్రదించాలని ఉరుకులు పెట్టిన కాంగ్రెస్ సర్కారు ఎట్టకేలకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. ఆ దిశగా వివ రాలను అందించాలని సంబంధిత అధికారు లను ఆదేశించినట్టు తెలిసింది. కృష్ణా బేసిన్‌లో నీటికొరత ఉన్న నేపథ్యంలో మహారాష్ట్ర సర్కా రును సంప్రదించి కొయినా డ్యామ్ నుంచి 30 టీఎంసీలు, కర్ణాటక సర్కారును సంప్ర దించి 10 టీఎంసీలను కోరాలని సర్కారు నిర్ణ యించింది. అందుకు సంబంధించి ప్రతిపాద నలను సైతం సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. అయితే కొయినా నుంచి నీళ్లు తెచ్చుకోవడం పెద్ద సవాల్ అని, ఖర్చుతో కూడిన వ్యవహారంతోపాటు, అందే ప్రయోజ నాలు తక్కువేనని అధికారులు సర్కారుకు నివేదించారు. రాష్ట్రంలోనే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని సూచించారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికు మారి సోమవారం సచివాలయంలో సాగునీ టిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్సీ మురళీధర్‌తో ప్రత్యేక సమీక్ష నిర్వ హించారని సమాచారం. తాగునీటిని అందిం చేందుకు రాష్ట్రంలో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారని తెలుస్తున్నది. గతంలో సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి ఎన్ని నీళ్లను వినియోగిం చుకున్నాం? ఏయే సందర్భాల్లో ఏ మేరకు జలాలను ఎత్తిపోసుకున్నాం? అందుకు చేప ట్టాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై పూర్తి స్థాయి వివరాలను అందివ్వాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇరిగే షన్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టి హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను సంప్రదిం చినట్టు తెలుస్తున్నది.

విద్యా - ఉద్యోగ సమాచారం

ఉమెన్ వర్సిటీకి 819 పోస్టులు కావాలి

రాష్ట్ర ప్రభుత్వానికి వర్సిటీ ప్రతిపాదనలు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏర్పాటైన తొలి మహిళా విశ్వవిద్యాలయానికి 819 అదనపు పోస్టులు మంజూరు చేయాలని వర్సిటీ ప్రతిపాదిం చింది. 359 బోధన, 460 బోధనేతర పోస్టులు కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి పాదనలు సమర్పించింది. వర్సిటీలో ప్రస్తుతానికి 25 మంది రెగ్యులర్ స్టాఫ్ మాత్రమే ఉన్నారు. వీరిలో 20 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్, మరో ముగ్గురు ప్రొఫెసర్లు మాత్రమే పనిచేస్తున్నారు. కోఠి మహిళా కాలేజీని మహిళా యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ 2022 ఏప్రిల్‌లో కేసీఆర్ ప్రభుత్వం జీవో-12ను జారీచేస్తూ, 'తెలం గాణ మహిళా విశ్వవిద్యాలయం (ఉమెన్ యూనివర్సిటీ)' పేరును ఖరారు చేసింది. ఈ వర్సిటీ ఏర్పాటుకు అప్పట్లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఉస్మానియా నుంచి ఈ వర్సిటీ విడిపోవడంతో ఓయూ నుంచి 94 టీచింగ్, 100 బోధ నేతర పోస్టులు వర్సిటీకి మంజూరయ్యాయి. ఇవి పోను ఇటీవల కొత్త కోర్సులను ప్రవే శపెట్టడం, కొత్త విభాగాలను ఏర్పాటు చేయడంతో అదనంగా 819 పోస్టులను మంజూరు చేయాలని వర్సిటీ అధికారులు ప్రతిపాదించారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపినా, ఇప్పటివరకు వర్సిటీ యాక్ట్‌ను రూపొందించలేదు. ఈ నేపథ్యంలోనే క్యాబినెట్ ఆమోదం ఆధారంగా వర్సిటీ యాక్ట్‌ను అసెంబ్లీ ముందుం చాల్సి ఉంది. ఆ తర్వాత గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు. ఈ ప్రక్రియను సైతం ప్రారం భించాలని వర్సిటీ అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. మహిళా వర్సిటీకి తొలి వీసీని సెర్చ్ కమిటీ లేకుండానే నియమిస్తారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

ఆర్టీసీ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ భర్తీకి దరఖాస్తులు

ఫిబ్రవరి 16లోపు దరఖాస్తుల గడువు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): టీఎస్ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రీజియన్ల పరిధి లోని నాన్ ఇంజినీరింగ్ విభాగంలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 150 ఖాళీల భర్తీ కోసం ఆన్‌లైన్ విధానంలో ఫిబ్రవరి 16లోగా దరఖాస్తులను స్వీక రిస్తారు. దరఖాస్తుదారులు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ లేదా తత్సమాన డిగ్రీలో 2018 - 2023 సంవత్సరాల మధ్య ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏండ్ల మధ్య వయోపరిమితి కలిగి ఉండాలి. శిక్షణ వ్యవధి మూడేండ్లు ఉంటుంది. విద్యార్హతలు, ధ్రువపత్రాల పరిశీలన, స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వే షన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు. మొదటి, రెండు, మూడేండ్లకుగాను వరుసగా నెలకు రూ.15 వేలు, రూ.16 వేలు, రూ.17 వేల చొప్పున ప్రతినెలా ఉపకార వేతనం ఇస్తారు. దరఖాస్తులను www.nats. education. gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

రీజియన్ల వారీగా అప్రెంటిస్ ఖాళీలు

రీజియన్	ఖాళీలు
హైదరాబాద్	26
సికింద్రాబాద్	18
కరీంనగర్	15
మహబూబ్‌నగర్	14
వరంగల్	14
నల్లగొండ	12
మెదక్	12
రంగారెడ్డి	12
ఆదిలాబాద్	09
ఖమ్మం	09
నిజామాబాద్	09

హైదరాబాద్‌లో సీఐఎస్సీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కౌన్సిల్ ఆఫ్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్సీఈ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లోని హబ్సి గూడ రవీంద్రనగర్‌లో ఏర్పాటైంది. అటానమస్ నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డు అయిన దీనిని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రారంభించారు. ఈ బోర్డు కింద జాతీ యంగా 2,750 స్కూళ్లు ఉన్నాయి. ఈ సంస్థకు న్యూఢిల్లీ, నోయిడా, కోల్‌కత్తాల్లోనూ కార్యాలయాలు ఉన్నాయి. ఈ బోర్డు ద్వారా గుర్తింపు పొందిన స్కూళ్లలో అమలుచే స్తున్న కరికులంపై నిపుణులకు, టీచర్లకు శిక్షణ ఇస్తారు.

'ధూప దీప నైవేద్యం' వేతనాలు మంజూరు

హైదరాబాద్, జనవరి 22(నమస్తే తెలం గాణ): ధూపదీప నైవేద్యం (డీడీఎన్) పథకం కింద అర్చకులకు ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల గౌరవ వేతనాలను మంజూరు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచి 6,271 మంది అర్చకులకు గౌరవ వేతనాల కింద రూ.11.02 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

హైదరాబాద్‌లో ఇంటర్న్‌షిప్స్ 3 శాతమే..

- 34 శాతంతో ఢిల్లీ నగరం టాప్
- తర్వాతి స్థానాల్లో ముంబై, బెంగళూరు
- ఇంటర్న్‌షాలా వార్షిక నివేదికలో వెల్లడి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలం గాణ): ఇటీవల ఇంటర్న్‌షిప్ వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఒకవైపు చదుకుం టూనే మరోవైపు నైపుణ్యాన్ని మెరుగుపర్చు కుంటూ, పారితోషికాన్ని ఆర్జించేందుకు ఇంట ర్న్‌షిప్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గత ఐదేండ్లల్లో దేశంలో ఇంటర్న్‌షిప్స్ 200 శాతం పెరుగుదలను నమోదుచేశాయి. వీటిలో 23 శాతం ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్లే కావడం విశేషం. హైదరాబాద్ ఇంటర్న్‌షిప్ వాటా కేవలం 3 శాతం మాత్రమే. రాష్ట్రాల వారీగా తీసుకుంటే ఢిల్లీ 34 శాతంతో ముందంజలో ఉండగా, ముంబై 16, బెంగ ళూరు 10 శాతంతో టాప్-3 స్థానాల్లో ఉన్నాయి. పుణె 5, హైదరాబాద్, జైపూర్ 3 శాతం ఇంటర్న్‌షిప్ వాటానే కలిగి ఉన్నాయి. ఈ ఆసక్తికరమైన ఈ విషయాలను ఇంటర్న్ షాలా తన వార్షిక నివేదికలో వెల్లడించింది.

ఇంటర్న్‌షాలా నివేదిక ప్రధాన వివరాలు

- ఇంటర్న్‌షిప్‌నకు షార్ట్‌లిస్ట్ చేసిన దరఖా స్తుదారుల్లో 33 శాతం బీటెక్ అర్హత గల వారు కాగా, 23 శాతం మంది ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మీడియా ఇంట ర్న్‌షిప్స్ 18 శాతం ఉండగా, డేటా సైన్స్‌లో అతి తక్కువగా కేవలం ఒక శాతం ఇంటర్న్‌షిప్స్ నమోదయ్యాయి.
- 2023లో గరిష్ఠ స్టైఫండ్ నెలకు రూ.1.35 లక్షలకు చేరింది. సగటు స్టైఫండ్ రూ.8 వేలుగా ఉంది.
- బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థులు 22 శాతం ఇంటర్న్‌షిప్ చేస్తుండగా, బీటెక్ ఫైనలియర్ వారు 19 శాతం మాత్రమే ఉన్నారు.
- సేల్స్, మార్కెటింగ్, డిజిటల్ మార్కె టింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్, కస్టమర్ సపోర్ట్ అండ్ ఆపరేషన్స్ రంగాలు ఎక్కు వగా ఇంటర్న్‌షిప్ ఆఫర్ చేస్తున్నాయి.
- 48 శాతం వర్క్ ఫ్రమ్ హోంలో, మరో 42 శాతం కార్యాలయాల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు.
- వెర్బల్, స్పోకెన్ ఇంగ్లిష్ ప్రావీణ్యతలను 15 శాతం, ఎంఎస్ ఎక్సెల్, సోషల్‌మీ డియా, డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యా లను 4 శాతం వరకు రిక్రూటర్లు ప్రాధా న్యమిస్తున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

- మరణాలను అరికట్టేందుకు అటవీశాఖ ప్రయత్నాలు
- మహారాష్ట్రతో సమాచారం పంచుకోవాలని నిర్ణయం
- సమన్వయ సమావేశం కోసం రాష్ట్ర అటవీశాఖ లేఖ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలం గాణ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వన్యప్రా ణుల మరణాలను అరికట్టేందుకు తెలంగాణ అటవీశాఖ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మెరుగైన పర్యవేక్షణ, సమన్వయం, సమాచార భాగస్వామ్య వ్యవస్థతో సహా కొన్ని అంశాలను చర్చించడానికి మహారాష్ట్రతో ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణ యించింది. ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వా నికి లేఖ రాసింది. ఇటీవల కుమ్రంభీం ఆసిఫా బాద్ జిల్లాలోని దరిగావ్ గ్రామంలో రెండు పులులు మరణించిన నేపథ్యంలో కాగజ్‌నగ ర్‌లో అదనంగా కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. ఈ సమావేశం తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల అటవీ శాఖల మధ్య సమన్వయం కోసం జరిగే సాధారణ సమావేశమని ప్రిన్సి పల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ఎం డోబ్రి యాల్ తెలిపారు. 10 రోజుల్లో సమావేశం జరిగే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. పశు వుల పరిహారం సొమ్ము పంపిణీ, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైతం అటవీ శాఖ మంగళవారం కాగజ్‌నగర్‌లో సమావేశం నిర్వహించనున్నది.

కోర్ కొలువులకు ఢోకా లేదు

మొదటిపేజీ తరువాయి...

రంగంలో పెట్టుబడులు రాబోతున్నాయి. అంటే ఈ రంగంలో ఇంజినీర్లకు మరింత డిమాండ్ పెరగబోతున్నది. కాబట్టి కోర్ కోర్సు లను కొనసాగించాలి.

తల్లిదండ్రులే నెడుతున్నారు

ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈ బూమ్ అధికంగా ఉన్నది. దీంతో కాలేజీలు సీఎ స్ఈ కోర్సుల సీట్లను పెంచుకుంటున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈ బూమ్‌కు ప్రైవేట్ కాలేజీలు ఒక కారణం అయితే, తల్లిదండ్రులు మరో కారణం. పిల్లల ఇష్టాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులే సీఎస్ఈ కోర్సుల్లోకి నెడుతున్నారు. దీన్ని గమనించే ఐఐటీలు సీఎ స్ఈ కోర్సుల్లో సీట్లను పెంచుకోవడంలేదని అంతా గ్రహించాలి. అంతా సీఎస్ఈ కోర్సునే ఎంచుకునే వైఖరి మంచిది కాదు. ఒకేసారి సీఎ స్ఈ ఇంజినీర్లంతా మార్కెట్లోకి వస్తే పరిస్థితి ఏంటి? అందరికి ఉద్యోగాలు కల్పించే పరిస్థితు లుంటాయా? రాబోయే రోజుల్లో దేశానికి ఇదో పెద్ద సవాల్. ఇప్పటి నుంచే జాగ్రత్త పడటం అవసరం. సీఎస్ఈ వాటికి ప్రారంభ వేతనాలు భారీగా ఉంటున్నాయి. దాంతో అంతా సీఎ స్ఈ వెంట పడుతున్నారు.

ఏఐ, చాట్ జీపీటీతో మార్పులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్‌జీపీటీల హవాతో కంప్యూటర్ సైన్స్‌లో అనేక మార్పులు రాబోతున్నాయి. ఒక రకంగా సీఎ స్ఈకి ఏఐ సవాల్ విసరబోతున్నది. చాలా మంది కోడింగ్‌ను కంప్యూటర్ సైన్స్ కోర్సుగా భావిస్తున్నారు. కోడింగ్ కంప్యూటర్ సైన్స్‌లో ఒక భాగం మాత్రమే. ఏఐ, చాట్‌జీపీటీతో ఈ ఉద్యోగాల సంఖ్య భవిష్యత్తులో తగ్గే అవకా శాలు ఉన్నాయి.

ఈ-కుబేర్ బిల్లులు మంజూరుచేయండి: పీఆర్టీయూ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలం గాణ): రెండేండ్లుగా ఈ-కుబేర్‌లో పెండిం గ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. పెండింగ్‌లో ఉన్న జీవిత బీమా మెచ్యూరిటీ, సరెండర్ లీవులు, జీపీఎఫ్, 2022 పీఆర్సీ ఎరియర్స్, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, భిక్షంగౌడ్ సోమ వారం సచివాలయంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.